ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 311 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 15 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి
# నోటిఫికేషన్ విడుదల



న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 14 (ప్రభాత ఉదయం): ఇండియన్ సివిల్ సర్వీసుల్లో 1,056 పోర్టుల భర్తీకి సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ పరీక్షకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం నుంచి వచ్చే నెల మార్చి 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రిలిమినరీ పరీక్ష మే 26న, మెయిన్స్ అక్టోబర్ 19న జరుగనున్నది. దాంతో పాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 150 పోస్టు భర్తీకి సైతం ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకునే ..మిగతా 2లో

# పదేళ్లు నేనే సీఎం

కేసీఆర్ అధికారంలోకి మళ్లీ వస్తాం అంటున్నారు..
నేను ఇక్కడే ఉంటా.. ఎలా వస్తారో చూస్తా..
సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..
15,750 మంది అభ్యర్థులకు పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): పదేళ్లు అధికారంలో ఉంటా.. ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే.. కేసీఆర్ అధికారంలోకి మళ్లీ వస్తాం అంటున్నారు.. నేను ఇక్కడే ఉంటా.. ఎలా వస్తారో చూస్తా.. అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బుధవారం 15,750 మంది అభ్యర్థులకు పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేశారు. ప్రక్రియ పూర్తైన అభ్యర్థుల నియామకాలకు హైకోర్టు ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాల అందజేత కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సీఎంగా మరో పదేళ్లు ఉంటానంటూ పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తామంటున్నారని.. అసెంబ్లీకి రాని వారికి అధికారం ఎందుకంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రావడానికి కేసీఆర్ కి ధైర్యం లేదని.. కానీ నల్గొండ పోయి మాట్లాడుతున్నారంటూ కౌంటర్ ఇచ్చారు.. పాలిచ్చే బర్రెని కాదని దున్నపోతును తెచ్చుకున్నారని కేసీఆర్ అంటున్నారు.. అసెంబ్లీలో అటెండర్ రేసు గుర్రం వచ్చిందని చెప్పాడంటూ ..మిగతా 2లో





నీకు చేతకాకపోతే తప్పుకో...
# నేను చేసి చూపిస్తా

కాళేశ్వరం పునరుద్ధరణపై సీఎంను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్య
ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయాలు చేస్తోంది
ఎంత తక్కువ చేసి మాట్లాడినా కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయని
ఇందులో మేమెలాంటి తప్పు చేయలేదు..
ఎలాంటి విచారణకైనా సిద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించడం చేతకాకపోతే తప్పుకొని ప్రభుత్వాన్ని తమకు అప్పగించాలని, రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తే తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి ప్రాజెక్టును పునరుద్ధరిస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. 'నాకు చేత కాదు.. నువ్వు చేసి చూపించమని రేవంత్ అడిగితే నేను సిద్ధం.. నాకు బాధ్యత అప్పగిస్తే చేసి చూపిస్తా' అని అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'శాసనసభ పవిత్రత, సంప్రదాయాలను సీఎం రేవంత్ మంట గలుపుతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బురద రాజకీయాలకు పాల్పడుతోంది. ప్రభుత్వం ఎంత తక్కువ చేసి మాట్లాడినా కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయని, ప్రజలకు జీవధార. ఈ ప్రాజెక్టు విషయంలో మేము ఎలాంటి తప్పు చేయలేదు. ఈ విషయంలో ఏ తరహా విచారణకైనా మేము సిద్ధంగా ఉన్నాం. విచారణ జరిపి బాధ్యులను శిక్షించండి..'అని హరీశ్‌రావు అన్నారు. 'ప్రాజెక్టులో సాంకేతిక సమస్యలను పరిష్కరించి, యుద్ధ ప్రాతిపదిక మరమ్మతు పనులు పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలి. రెండు పిల్లర్లు కుంగాయనే నెపంతో మొత్తం ప్రాజెక్టు ప్రతిష్టను డామేజ్ చేసే దుష్టపన్నాగానికి కాంగ్రెస్ పాల్పడుతోంది. కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేసి పొలాలకు నీళ్లు మళ్లించండి కానీ తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు. కాళేశ్వరం ద్వారా 20 లక్షల ఎకరాలకు ప్రయోజనం కలిగింది. ప్రాజెక్టు ఫలాల గురించి చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. గతంలో కడెంవాగు ప్రాజెక్టు, ..మిగతా 2లో


# సీఎంను అగౌరవపరిచేలా మాట్లాడుతున్నారు..



## బీఆర్ఎస్ నేతలపై రేవంత్ రెడ్డి మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): సీఎంను అగౌరవపరిచేలా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతలు పదేపదే భాష గురించి మాట్లాడుతున్నారని.. మాజీ సీఎం నిన్న నల్గొండలో మాట్లాడిన భాషపై చర్చిద్దామా? అని ప్రశ్నించారు. ఒక సీఎంను పట్టుకుని పీకనీకి పోయారా అని అంటారా? అంటూ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు మొన్నటి ఎన్నికల్లో మీ ప్యాంటు పీకేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణ సమాజం పట్ల, రైతుల పట్ల గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్షం మేడిగడ్డకు వచ్చేదన్నారు. కాళేశ్వరంపై, నదీ జలాలపై చర్చకు తాము సిద్ధమన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి వస్తే ప్రాజెక్టులపై ఎంత సేపైన చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు సీఎం. మేడిగడ్డ కుంగిపోతే.. అందులో నీళ్లు నింపడానికి అవకాశం ఉంటదా? కడియం శ్రీహరి, హరీష్ లకే పెత్తనం ఇస్తాం.. నీళ్లు నింపి చూపించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాళేశ్వరంపై కూడా మేం చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అబుదాబీలో మొట్టమొదటి
# హిందూ ఆలయం
## ప్రారంభించిన నరేంద్ర మోడీ



అబుదాబీ, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): యూఏఈలోని అబుదాబీలో దాదాపు రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన హిందూ ఆలయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మోడీ యూఏఈకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బోచాసనవాసీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీపీఏఎస్) ఆలయాన్ని నిర్మించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్మించిన మొట్టమొదటి హిందూ దేవాలయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. దాదాపు రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆలయం మధ్యప్రాచ్యం, యూఏఈలోని హిందూ జనాభాకు అతి ముఖ్యమైనది. 27 ఎకరాల విస్తీర్ణంలో 108 అడుగుల ఎత్తైన ఈ ఆలయం మధ్యప్రాచ్యంలో అతిపెద్ద హిందూ దేవాలయం కానుంది. 2015లో యూఏఈ రాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, అబు ముీఖా దేవాలయం కోసం 13.5 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. 2019లో మరో 13.5 ఎకరాల భూమిని విరాళం ఇవ్వగా.. ఆలయ నిర్మాణం ఘనంగా ప్రారంభమైంది. 2018లో ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఆలయానికి పునాదిరాయి వేశారు. బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ (బీఏపీఎస్) ఈ ఆలయాన్ని నిర్మించింది. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్టాపన ..మిగతా 2లో

# బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర

## మరోసారి ఛాన్స్ ఇచ్చిన కేసీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్రను ఖరారు చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆయన అభ్యర్థిత్వానికి ఆమోదముద్ర వేశారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా ఆయన 20 నెలల పాటు కొనసాగారు. 2022 మే 30న తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు రవిచంద్ర. ఆయన పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియనుంది. తెలంగాణ నుంచి ముగ్గురు సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో కాంగ్రెస్ నుంచి మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్‌లు రాజ్యసభ బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. 2018లో ..మిగతా 2లో



శాసనసభ బీజేపీ పక్షనేతగా
# ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం): తెలంగాణ శాసనసభలో బీజేపీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. మహేశ్వర్‌రెడ్డిని బీజేపీఎల్‌పీ నేతగా నియమిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ పక్ష ..మిగతా 2లో

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత



## మాజీ మంత్రులకు చేదు అనుభవం..
## మీడియా పాయింట్‌కు రానివ్వని పోలీసులు, మార్షల్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం):తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ సభ్యులకు చేదు అనుభవం ఎదురైంది. మీడియా పాయింట్ వద్దకు వెళ్లేందుకు వారిని అధికారులు అనుమతించలేదు. దీంతో సభ్యులు అక్కడే నిరసన తెలిపారు. లోపల అసెంబ్లీలో నిలువరించడం, బయట నిలువరించడం ఏంటంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫైరయ్యారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ నిరసనకు దిగారు. కంచెలు తొలగిస్తామని, అసెంబ్లీ దగ్గర కంచెలు ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# పదేళ్లు నేనే సీఎం



**మొదటి పేజీ తరువాయి...**

కౌంటర్ ఇచ్చారు. చచ్చిన పామును చంపే అలవాటు తమకు లేదన్నారు. 10 ఏళ్ల క్రిందట కేసిఆర్ పెట్టిన సంతకాలు ఇప్పుడు గుదిబండగా మారాయని.. అడ్డా మీద కొట్లడటం కాదు చట్ట సభలోకి రావాలంటూ రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్స్ కు రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో గంజాయిని మాట వినిపించకుడదని.. గంజాయిపై ఉక్కుపాదం మోపాలంటూ పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న ఇదే వేదికలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధి సమక్షంలో ప్రమాణం చేసినపుడు ఎంత ఆనందం కలిగిందో.. నియామక పత్రాలు అందిస్తుంటే.. అంతకంటే ఎక్కువ ఆనందంగా ఉందంటూ వ్యాఖ్యానించారు. తమకు కుటుంబం అంటే తెలంగాణ ప్రజలని.. పరీక్షలు రాసి ఎదురుచూసి నిరాశకు గురైన వారికి అండగా ఉండాలని కాంగ్రెస్ భావించిందన్నారు. 2014 లో రాష్ట్రం వచ్చాక నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు వస్తాయని భావించారని.. అలా రాలేదనన్నారు. గత ప్రభుత్వం వారి కుటుంబం గురించే ఆలోచించిందని.. న్యాయస్థానాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించే అవగాహన గత ప్రభుత్వ పెద్దలకు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అందరి సమస్యలపై దృష్టి పెట్టామని.. అందరికీ తాను అండగా ఉంటానని.. ఎలాంటి సమస్యా రానియ్యనంటూ పేర్కొన్నారు. స్టాప్ నర్స్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చాం.. నేడు కానిస్టేబుల్ నియామకాల పత్రాలు ఇస్తున్నాం.. నిరుద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## జన్మదిన శుభాకాంక్షలు
## కోట్ల రుత్విక

ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ...
కోట్ల మౌనిక, కోట్ల చంద్రకాంత్.

### నీకు చేతకాకపోతే తప్పుకో...
## నేను చేసి చూపిస్తా

**మొదటి పేజీ తరువాయి...**

సింగూరు డ్యాం, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కొట్టుకుపోయినా పునరుద్ధరించడం జరిగింది. పోలవరం డయాఫ్రం వాల్, రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కారకులను శిక్షించి, ప్రాజెక్టులను పునరుద్ధరించి రైతులకు అన్యాయం జరగకుండా చూస్తారు..'అని హరీశ్ వ్యాఖ్యానించారు. 'రాజకీయ లబ్ధి కోసమే రేవంత్ డైవర్షన్ టూర్ పెట్టుకుని, ఇంజనీర్లు వాస్తవాలు చెబుతున్నా దబాయిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో హెడ్ వర్క్స్ పూర్తయిన తర్వాతే ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణంపై నిధులు వెచ్చిస్తాం. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల ద్వారా 27 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇస్తే, మేము అన్ని పనులు పూర్తి చేసి 6.36 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం కాలువలు తవ్వి నీరు ఇవ్వకుంటే సాగు, తాగునీటి కష్టాలు వస్తాయి..'అని మాజీ మంత్రి హెచ్చరించారు. 'రీ ఇంజనీరింగ్ వలన ప్రాజెక్టు అంచనా వ్యయం అనివార్యంగా పెరుగుతుంది. ప్రాణహిత–చేవెళ్ళ ఆంచనా విలువ రూ.17 వేల కోట్లతో మొదలై రూ.38 వేల కోట్లకు పెరిగింది. ఆ తర్వాత కేంద్ర జల సంఘానికి నివేదించే నాటికి రూ.40 వేల కోట్లకు పెరిగింది. తట్ట మట్టి ఎత్తకుండానే ప్రాజెక్టు అంచనా విలువ రూ.17 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు ఎందుకు పెరిగినట్టు?. కాళేశ్వరం ప్రాజెక్టులో జలాశయాల సామర్థ్యం పెంచాం. కొత్త జలాశయాలు ప్రతిపాదించాం. జలాశయాల సామర్థ్యం పెరగడంతోనే అంచనాలు పెరిగాయి..'అని హరీశ్‌రావు వివరించారు.

## బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర



**మొదటి పేజీ తరువాయి...**

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన గాయత్రి రవి ఓటమి పాలయ్యారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు గాయత్రి రవి సమీప బంధువు. గాయత్రి రవి 1964, మార్చి 22న మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తి గ్రామంలో జన్మించారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, కూతురు గంగా భవాని, కుమారుడు సాయి నిఖిల్ చంద్ర ఉన్నారు. గ్రానైట్ వ్యాపారిగా ఆయనకు తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు వుంది. తెలంగాణ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ... తెలంగాణ మున్నూరు కాపు ఆల్ అసోసియేషన్ జేఏసీ గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. స్వగ్రామంలో బడులు, గుడులు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలను కల్పించి.. దాతగానూ చెరగని ముద్ర వేసుకున్నారు. మేడారం సమ్మక్క సారక్క ఆలయ అభివృద్ధికి తన వంతు ఆర్థిక సాయం చేశారు. 2016 లో జరిగిన జాతర సందర్భంగా రూ. 3.5 కోట్లు వెచ్చించి అమ్మవార్ల గద్దెలు, క్యూలైన్లకు గ్రానైట్ రాళ్లు, స్టీల్ రెయిలింగ్‌తో ఆధునీకరించారు. 2018లో సుమారు రూ. 20 లక్షలు వెచ్చించి మరికొన్ని క్యూలైన్లను ఆధునీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 122 రకాల పూలను తీసుకొచ్చి అమ్మవారి గద్దెల చుట్టూ అలంకరించారు. ఖమ్మం గ్రానైట్ పరిశ్రమకు గాయత్రి రవి క్వారీలే జీవనాధారం అని చెప్పొచ్చు. అక్కడ సుమారు 500 స్లాబ్ ఫ్యాక్టరీలు, వాటిలో 2000 కట్టర్లు, 150 టైల్స్ ఫ్యాక్టరీలు, మరో 10 ఎక్స్‌పోర్ట్ యూనిట్‌లు వున్నాయి. వీటిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమలకు 60 నుంచి 70 శాతం ముడి గ్రానైట్.. గ్రాయత్రి గ్రానైట్ సంస్థ నుంచే సరఫరా అవుతోంది.



మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్ కుమార్‌కు పుష్పవిత్ర బంధం చేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ కమిషనర్ కె రవికుమార్

## మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా ప్రదీప్ కుమార్

గండిపేట, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం) మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ గా డి ప్రదీప్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పదవి బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్ కుమార్ ను రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో సంపూర్ణ పారిశుధ్యం కి ప్రజా ప్రతినిధులు కాలనీవాసులు ప్రజలు సహకరించాలని కోరారు

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

అభ్యర్థుల వయసు 21-32 సంవత్సరాల మధ్య ఉండాలి. అయితే, రిజర్వేషన్ల ఆధారంగా మినహాయింపు సైతం ఉంటుంది. ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100 చెల్లించాలి. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. సివిల్ సర్వీస్ ఎగ్జామ్ రాజేందుకు యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ upsc.gov.in లాగిన్ చేయాలి. హోమ్ పేజీలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2024 లింక్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేలా కొత్త విండో ఓపెన్ అవుతుంది. మొదట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక అకౌంట్‌లోకి లాగిన్ ఇవ్వాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను నింపి.. ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత పేజీని డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుకోవాలి. ఏదైనా అవసరం కోసం హార్డ్ కాపీని తమ వద్ద ఉంచుకోవాలి. అభ్యర్థులు దరఖాస్తును నింపే సమయంలో కొన్ని పత్రాలను జమ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వర్కింగ్‌లో ఉన్న ఈ మేయిల్ ఐడీ, మొబైల్ నంబర్, స్కాన్డ్ ఫొటో, సతకం, గుర్తింపు కార్డు, విదార్హతలకు సంబంధించి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

## అబుదాబీలో మొట్టమొదటి హిందూ ఆలయం

**మొదటి పేజీ తరువాయి...**



కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయాన్ని ప్రారంభించేందుకు అబు ధ్రీఖాకు వెళ్లే ముందు 8 నెలల్లో మూడోసారి యూఏఈ పర్యటనకు వచ్చిన మోడీ.. ప్రపంచ ప్రభుత్వ శిఖరాగ్ర సదస్సులో కీలక ప్రసంగం చేశారు. మడగాస్కర్ అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా, దుబాయ్ ఎమిర్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్‌లతో మోడీ ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. ప్రారంభోత్సవ అధిపతి, ప్రధాని మోడీ ఆలయ ప్రాంగణంలో గంగా , యమునా నదులలో నీటిని సమర్పించి ఆపై ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఇస్లాం అధికారిక మతమైన యూఏఈలో దాదాపు 3.6 మిలియన్ల మంది భారతీయ కార్మికులు నివసిస్తున్నారు. ఆలయంలో ప్రారంభోత్సవ వేడుకకు భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, బాలీవుడ్ తారలు, ముఖేష్ అంబానీ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. యూఏఈలో భారత మాజీ రాయబారి నవదీప్ సూరి మాట్లాడుతూ.. భారతీయ సమాజానికి ఇది చాలా ప్రతీకాత్మకమైన రోజు అన్నారు. ఈ ఆలయాన్ని సాంప్రదాయ నాగర్ నిర్మాణ శైలిలో నిర్మించారు. 108 అడుగుల ఎత్తుతో దీన్ని నిర్మించారు. ఆలయ శిఖర భాగంలో ఏడు శిఖరాలు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. ఈ ఏడు శిఖరాల్లో ఒక్కోటి యూఏఈలోన ఒక్కో ఎమిరేట్స్‌ను సూచిస్తుంది. మందిర్ చుట్టూ చక్కగా రూపొందించబడిన ఘాట్‌లు, గంగా యమునా నదులను తలపించేలా తీర్చి దిద్దారు. ఈ ఆలయంలో 'డోమ్ ఆఫ్ హార్మోనీ', 'డోమ్ ఆఫ్ పీస్' అనే రెండు గోపురాలను నిర్మించారు.

## శాసనసభ బీజేపీ పక్షనేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

ఉపనేతలుగా పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి నియామకం అయ్యారు. శాసనమండలి పక్షనేతగా ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని నియామకం అయ్యారు. కాగా మహేశ్వర్ రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన విదితమే. 2009లో ప్రజారాజ్యం తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన. 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందే మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించించగా ఇందులో గోషామహల్ నుంచి రాజాసింగ్ హ్యాట్రిక్ విజయం సాధించారు.

## ఇద్దరు రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్
### రేణుకచౌదరి అనిల్ కుమార్ యాదవ్






ఢిల్లీ, ఫిబ్రవరి 14( ప్రభాత ఉదయం)తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభ అభ్యర్థులను బుధవారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ప్రకటించింది. రేణుక చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్‌కు ఏఐసీసీ అవకాశం ఇచ్చింది.మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. దీంతో పెద్దల సభలోకి యువకుడు అనిల్ కుమార్ యాదవ్ అడుగుబెట్టనున్నారు. రాజ్యసభ విషయంలో అనూహ్యంగా అనిల్ కుమార్యాదవ్ తెరపైకి వచ్చారు. యూత్ కాంగ్రెస్ కోటాలో అనిల్‌కు అవకాశం కల్పించింది కాంగ్రెస్ అధిష్టానం. ఇక.. అజయ్ మాకెన్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, చంద్రశేఖర్‌లను రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ కర్ణాటక నుంచి ఎంపిక చేసింది. మధ్య ప్రదేశ్ నుంచి అశోక్‌సింగ్‌ను ఏఐసీసీ ఎంపిక చేసింది. వీరంతా (గురువారం) నామినేషన్ వేయనున్నారు.

### ఎక్సైజ్ శాఖలో
## ఎస్ఐల బదిలీలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం)లోక్‌సభ ఎన్నికల నేపథ్యం లో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు జోగులాంబ గద్వాల జిల్లా మద్య నిషేద అబ్కారీ కార్యాలయంలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గద్వాల ఎక్సైజ్ కార్యాలయంలో పని చేస్తున్న పి.రాజేందర్ వనపర్తి, డి.కృష్ణ కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ లకు బదిలీ కాగ, డిటిఎఫ్ ఎస్ఐ మొగులప్ప గద్వాల నుండి శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ నుండి ఎన్.వీరేశలింగం, ఆత్మకూరు నుండి ఎ.వెంకటేష్, కోస్గి నుండి కె. శ్రీకాంత్ రెడ్డి గద్వాల ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలుగా బదిలీపై వచ్చారు. అయిజ ఎక్సైజ్ స్టేషన్ లో పని చేస్తున్న ఇ.బాలవర్ధన్ నల్గొండకు, వి.గోవర్ధన్ కోదాడకు బదిలీ కాగ వారి స్థానంలో భువనగిరి నుండి నాగరాజు గుండు, కొల్లాపూర్ నుండి మమత అయిజ ఎక్సైజ్ ఎస్ఐలుగా బదిలీ అయ్యారు. అలంపూర్ ఎక్సైజ్ ఎస్ఐ జి.హరికృష్ణ శంషాబాద్ కు బదిలీ కాగ ఆయన స్థానంలో రంగారెడ్డిలో పని చేస్తున్న యు.లక్ష్మీనారాయణ బదిలీపై వచ్చారు.

# అడుగంటిన జూరాల జలాశయం

### పడిపోతున్న భూగర్బ జలాలు
### ఆందోళన చెందుతున్న అన్నదాతలు





గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం)వర్షాలు లేక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. కుంటలు, చెరువులు ఎండిపోవడంతో భూగర్భజలాలు అందనంత లోతుగా వెళ్లుతున్నాయి. సాగుకు నీరందక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఎండతాపంతో త్రాగు నీటి కష్టాలు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులు, రిజర్వాయర్ లు, చెరువులు, కుంటలలో నీటి మట్టాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో సాగు, త్రాగు నీటి కష్టాలు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగు, త్రాగు నీరు అందించే వారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు పడితే ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండి అక్కడి నుంచి జూరాల ప్రాజెక్టుకు వరదనీరు చేరేది. గత ఏడాది వరద నీటి జాడలేక పోవడంతో కృష్ణానది బక్కచిక్కిపోయి జలాశయాలలో నీటి మట్టాలు గణనీయంగా పడిపోయాయి. గత ఏడాది జూరాల ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో జూరాలకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం తగ్గిపోయింది. జూరాల పై కోయిల్ సాగర్, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టు లు ఆదారపడి ఉన్నాయి. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 9.657 టిఎంసిలకు గాను 2.084 టిఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత సంవత్సరం (2023) జూలైలో ముంచెత్తిన కృష్ణా నది ప్రస్తుతం మూగబోయింది. 2002 నుంచి 2016 వరకు కృష్ణపరివాహక ప్రాంతాల్లో కరువు పరిస్థితి నెలకొనడంతో పంటల దిగుబడి తగ్గడంతో పాటుగా రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రసుతం అదే పరిస్థితి పునరావృతం అయ్యింది. ఎండకాలం సీజన్ ప్రారంభమైనప్పటికి మండుతున్న ఎండలతో నీటి ఆవిరి పెరిగి, జలాశయాల్లో నీరు అడుగంటుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితి ఇలా కొనసాగితే రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు ఎగువ ప్రాంతాల్లో కురిస్తే తప్పా జూరాలకు కొత్త నీరు వచ్చే అవకాశం లేకపోదు. అంత వరకు మంచి నీటికి కటకట తప్పదు. అయితే.. తాగునీటి అవసరాలకోసం కర్నాటకలోని ఆల్మట్టి నుంచి 15 టీఎంసీల నీటిని రాష్ట్రానికి తరలించేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నప్పటికీ సాగుభూములను కాపాడే ప్రయత్నం ఎలాచేస్తోందో ప్రశ్నార్థమైంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మహబూబ్ నగర్ జిల్లాల్లో నీటి ఎద్దడితో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి.

**క్రాప్ హాలీ డే..**

గత యేడాది ఊహించినంత వర్షాలు కురవకపోవడంతో కృష్ణానదీ మీద ఆదారపడి ఉన్న జూరాల ప్రాజెక్టులోకి నీటి మట్టం పెరగలేదు. జూరాల నీటి మట్టం గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అధికారులు ముందస్తుగానే క్రాప్ హాలిడే ప్రకటించారు. జూరాలలో నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకొని జూరాల కుడికాలువ, ఎడమ కాలువల ద్వారా వారబందీ విధించి త్రాగు, సాగుకు నీరందిస్తున్నారు.. జూరాల మీద ఆదారపడిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ ల ద్వారా సాగు నీరు నిలిపివేశారు. ర్యాలంపాడు గూడెందొడ్డి రిజర్వాయర్ ల నుంచి రెండో పంటకు సాగు నీరు విడుదల నిలిపి వేయడంతో రైతులు యాసంగి పంటలకు వేయడానికి ముందుకురాలేదు. బోర్లు, బావులు ఉన్న రైతులు మాత్రమే వరిపంటలు, ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు**

ఉమ్మడి జిల్లాలో గతేడాది వర్షాలు కురవక, జురాల జళాశయంలో నీటి నిల్వలు తగ్గడం, చెరువులు, కుంటల్లోనూ నీటి మట్టాలు తగ్గడంతో పాటు జిల్లాలో కొన్ని చోట్ల బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత పెరగకముందే భూగర్భ జలాలు తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే భూగర్భ జలాలు భారీగానే పతనమయ్యాయి.

**ఎండుతున్న పంటలు**

వర్షాకాలంలో సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ ఎండాకాలం నీటి ఎద్దడి అన్నదాతలను తీవ్రంగా వేధిస్తోంది. నిరంతరంగా బోరుబావుల వాడకం, నీటి వృథాతో పడిపోతున్న భూగర్భ జలాలు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. పెరిగిన సాగు విస్తీర్ణంతో చాలాగ్రామాల్లో అడుగంటిన చెరువులు దర్శనమిస్తున్నాయి. దీంతో పాతాలగంగ పతనమవ్వడంతో అన్నదాతల పొలాలు ఎండి మూగజీవాలకు మేతగా మారుతున్నాయి. కొందరు రైతులు పొలాలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తు అప్పులపాలవుతున్నారు.

## నూర్ మమ్మద్ కుంట వద్ద స్మశాన వాటికలో

# వసతులు కల్పించడానికి కృషి చేస్తాం

### స్మశాన వాటికలో బోరు పనులను ప్రారంభించిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్



నూర్ మమ్మద్ కుంట వద్ద స్మశాన వాటికలో బోరు పనులను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం) మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో గల నూర్ మమ్మద్ కుంట వద్దగల స్మశాన వాటికలో సదుపాయాలు కల్పించడానికి స్థానిక నాయకులతో కలిసి ముందుకు వెళ్తామని బాబుల్ రెడ్డి నగర్ మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ అన్నారు. బుధవారం ఒకరి దహన సంస్కారానికి వచ్చి అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవని గ్రహించి మంచి మనసుతోటి సొంత ఖర్చు తోటి నూర్ మొహమ్మద్ కుంట లోని స్మశాన వాటికలో కార్వాన్ కి చెందిన ఎ మల్లేష్ నేత సొంత ,రు 1,50,000 పైచిలుకు రూపాయలతో స్మశాన వాటికలో బోరు బావి మోటారు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చారు. మంచి హృదయం తోటి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన ఏ మల్లేష్ ని నూరు మమ్మద్ కుంట స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ అభినందించారు. ఈ కార్యక్రమానికి మంచి మనసుతోటి ఏ మల్లేశం లాంటివారు ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన అక్కడ వారి పట్ల మరింత గౌరవం పెరిగి అతనిని చూసి మరికొంతమంది దాతలకు ఇలాంటి కార్యక్రమాలు చేస్తే చాలా బాగుంటుందని ఇక్కడే కాకుండా ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలు చేస్తే చాలా బాగుంటుందన్నారు. నూరు మమ్మద్ కుంట పరిరక్షణ కమిటీ ఆశ భావం వ్యక్తం చేశారు గొట్టపుబావి పూజా కార్యక్రమానికి విచ్చేసిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ మాజీ కౌన్సిలర్ కృష్ణ గౌడ్, స్థానిక నాయకులు ఏ మాధవరెడ్డి సుధాకర్ గౌడ్, రాజు, అంబదాస్, సింహాద్రి, కిష్టప్ప, చిట్టి నూర్ మహమ్మద్ కుంట స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహించనున్నారు.



సేవాలాల్ మహరాజ్ చిత్రాన్ని గీస్తున్న చిత్రకారుడు రమావత్ శ్రీనివాస్ నాయక్

## బంజారా ప్రజల జీవనాన్ని ఉట్టి పడేలా చిత్రాలు గీసే రమావత్ శ్రీనివాస్ నాయక్

బుద్వేల్, ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆర్టిస్ట్, ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్న రమావత్ శ్రీనివాస్ నాయక్ బంజారా ప్రజల జీవన విధానాలు, వారి కట్టుబాట్లపై అనేక చిత్రాలను తన కుంచె ద్వారా గీసి పలువురి మన్ననలను పొందుకున్నారు. ఈనెల 15వ తేదీన జరగనున్న బంజారాల దైవ సమానులు సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రాన్ని కూడా అందంగా తన కుంచెతో గీశారు. రామావత్ శ్రీనివాస్ నాయక్ గీసిన సేవాలాల్ మహారాజ్ చిత్రం నేడు బంజారా ప్రజల వాట్సాప్ లలో చెక్కర్లు కొడుతుంది. రమావత్ శ్రీనివాస్ నాయక్ ఫోటోగ్రాఫర్ గా, ఆర్టిస్ట్ గా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. గతంలో ఆయన బంజారాల జీవన విధానం పై అనేక చిత్రాలను గీశారు.



అఖిల్ యాదవ్ ను అభినందిస్తున్న గ్రామస్తులు

# జేఈఈ మెయిన్స్... శంషాబాద్ విద్యార్థి

### రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించిన అఖిల్ యాదవ్

శంషాబాద్, ఫిబ్రవరి 14, (ప్రభాత ఉదయం) జే ఈ ఈ మెయిన్స్ లో శంషాబాద్ మండలానికి చెందిన అఖిలేష్ యాదవ్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి రంగారెడ్డి జిల్లాలో రికార్డు సృష్టించాడు. శంషాబాద్ మండలం హమీదుల్లా నగర్ గ్రామానికి చెందిన కాసారం రాజు యాదవ్ కుమారుడు కాసారం అఖిల్ యాదవ్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకును సాధించాడు. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన అఖిల్ యాదవ్ కు చుట్టుపక్కల గ్రామాల నాయకులు ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి తన ప్రతిభను చాటి 99.94 శాతం మార్కులు సాధించి అందరిని ఆకట్టుకున్నాడు. ఆదిభట్లలోని ఎస్సార్ కాలేజీ అకాడమీ డి ఎం కరస్పాండెంట్ భరత్ రెడ్డి. జోనల్ ఇంచార్జ్ ప్రసాద్ ల సహకారంతో విద్యార్థి తన ప్రతిభను చాటాడని అన్నారు. హమీదుల్లా నగర్ గ్రామానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం పట్ల ఘాన్సీ మియాగూడ గ్రామ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్, దేపల్లే సుజాత మల్లేష్ గౌడ్, తొండుపల్లి గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు ఇంజమూరి అమరేందర్ గౌడ్, బి. నరేందర్ గౌడ్ తదితరులు అఖిల్ యాదవ్ ను అభినందించారు.



కోరని బాల్ రాజ్



కోరని ప్రసాద్




కోరని దయానంద్

## ఈ నెల 18న బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘానికి ఎన్నికలు

### అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్న కోరని బాల్ రాజ్, కోరని ప్రసాద్, కోరని దయానంద్‌లు

బుద్వేల్, ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం) : బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘానికి ఈనెల 18న ఎన్నికలు జరగనున్నాయి. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలను బుద్వేల్ లో ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తారు. ఎన్నికైన వారు బస్తీలో అన్ని కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. అధ్యక్ష స్థానానికి ముగ్గురు బరిలో ఉన్నారు. వారిలో కోరని బాలరాజ్, కోరని ప్రసాద్ లకు గతంలో అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉంది. కోరని దయానంద్ కొత్తగా అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్నారు.

**పోటీలో ఉన్న వారు వీరే :**

బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘానికి జరుగుతున్న ఎన్నికలలో అధ్యక్ష పదవిలో కోరని బాల్ రాజ్, కోరని ప్రసాద్ , కోరని దయానంద్ లు పోటీలో ఉన్నారు.

ఉపాధ్యక్షులుగా గుంటి రాజ్ కుమార్ , కోరని రాజ్ కుమార్, కె ప్రవీణ్ కుమార్, బి నరేందర్, జి. ప్రణయ్ కుమార్, జి రవీందర్ లు బదిలో ఉన్నారు.

ప్రధాన కార్యదర్శులుగా కోరని వర ప్రసాద్, జి రవికుమార్ , కె నవీన్ లు పోటీ చేస్తున్నారు.

సంయుక్త కార్యదర్శులుగా ఎన్ నరేష్, కె శ్రావణ్ కుమార్, జి రమేష్ లు పోటీ చేస్తున్నారు.

కోశాధికారి పదవికి జి చందు, కె. రాకేష్, జి బల్ రామ్ పోటీలో ఉన్నారు.

## సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బంజారా ఉద్యోగులకు సెలవు ప్రకటించడం హర్షణీయం

### డాక్టర్ మాలోతు రమేష్ నాయక్



బుద్వేల్, ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం) : ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి సందర్భంగా బంజారా ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించడం సంతోషకరమైన విషయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త , డాక్టర్ మాలోతు రమేష్ నాయక్ అన్నారు. బంజారా ఉద్యోగులకు సెలవు ప్రకటించడానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బంజారా ఉద్యోగుల తరుపున, ప్రజల తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు . బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించుకోవడానికి ప్రభుత్వం సెలవు ప్రకటించడం సంతోషకరమన్నారు.



శశాంక్ జన్మదిన వేడుకలలో కుటుంబ సభ్యులు

## ఘనంగా శశాంక్ అప్పారెడ్డి గూడెం జన్మదిన వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం):అప్పారెడ్డిగూడెం భీమయ్య - మాధవి ల కుమారుడు శశాంక్ అప్పారెడ్డిగూడెం జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంక్ కేక్ కట్ చేశారు. శశాంక్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు తెలిసిన పెద్దలు బంధువులు కుటుంబ సభ్యులు స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు. సోదరి అప్పారెడ్డిగూడెం స్నేహ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలి



రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపో ముందు వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ జేపీసీ నాయకులు

బుద్వేల్, ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం) : కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపో ముందు ఆర్టీసీ జేఏసీ నాయకులు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వి. చంద్రయ్య , ఎస్ కృష్ణ, బి నారాయణ లు మాట్లాడుతూ, హిట్ అండ్ రన్ కేసులలో డ్రైవర్లకు శిక్షలు పెంచే భారత న్యాయ సంహిత చట్టంలోని 106 సెక్షన్ ను ను రద్దు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం, నేషనల్ మానిటైజేషన్ పైపులైనురద్దు చేయాలని తెలిపారు. పెట్రోల్ డీజిల్ పై కేంద్ర ఎక్సైజ్ డ్యూటీని, రాష్ట్ర వ్యాట్ ను తగ్గించాలన్నారు. ఆర్టీసీలపై పన్నుల భారం తగ్గించి కార్మికుల సమస్యలపై యూనియన్లతో యాజమాన్యంమాట్లాడాలని అన్నారు. ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని ఎం టి డబ్ల్యూ యాక్టు ప్రకారం పోటీలు ఉండాలని అన్నారు. విద్యుత్తు బస్సులకు ఇచ్చే సబ్సిడీ ఆర్టీసీకి ఇచ్చి బస్సులు కొనేలా స్కీం లో మార్పులు చేయాలని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు బాండ్ డబ్బులతో సహా 2017 - 2021 సంబంధించిన వేతన ఒప్పందాలను మరియు ఇతర ఆర్థిక అంశాలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో కార్మికులు పాల్గొన్నారు

# ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన ఇరు జట్లు

## రాజ్‌కోట్ టెస్ట్‌కు సిద్ధం



రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగనున్న మూడో టెస్ట్‌కు టీమిండియా సిద్ధం అవుతోంది. ఇప్పటికే చెరో మ్యాచ్ గెలిచి సమఉజ్జీలుగా ఉన్న ఇండియా-ఇంగ్లాండ్‌లకు ఈ మ్యాచ్ కీలకంగా మారనుంది. వైజాగ్ టెస్ట్ తర్వాత కాసింత విశ్రాంతి తీసుకున్న ఇరు జట్లు మళ్లీ ప్రాక్టీస్‌లో చెమటోడ్చాయి. ఇరు జట్ల క్రికెటర్లు మంగళవారం ముమ్మర ప్రాక్టీస్ చేశారు. రాజ్ కోట్ టెస్ట్‌లో గెలిచి ఎలాగైనా ఆధిక్యం సాధించాలన్న పట్టుదలతో కనిపిస్తున్న ఇరు జట్లు... పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాయి. పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశమున్న నేపథ్యంలో మరోమారు ఆసక్తిపోరుకు ఆస్కారముంది. సొంతగడ్డపై తమదే పైచేయి అనుకున్న టీమ్ఇండియాకు ఇంగ్లండ్ బజ్‌బాల్ వ్యూహంతో దీటైన పోటీనిస్తున్నది. దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న రజత్ పాటిదార్, సర్ఫరాజ్‌ఖాన్, ధృవ్ జురెల్, దేవదత్ పడిక్కల్ లాంటి యువ క్రికెటర్లు అవకాశం ఎదురుచూస్తున్నారు. సీనియర్ల గైర్హాజరీలో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. ఇప్పటికే విశాఖ టెస్టు ద్వారా రజత్ పాటిదార్ అరంగేట్రం చేయగా, రాజ్‌కోట్ టెస్టులో ధృవ్ జురెల్, సర్ఫరాజ్‌ఖాన్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగనున్న మూడో టెస్ట్‌కు టీమిండియా సిద్ధం అవుతోంది. ఇప్పటికే చెరో మ్యాచ్ గెలిచి సమఉజ్జీలుగా ఉన్న ఇండియా-ఇంగ్లాండ్‌లకు ఈ మ్యాచ్ కీలకంగా మారనుంది. అయితే ఈ మ్యాచ్‌తో బ్రిటీష్ జట్టు సారథి బెన్ స్టోక్స్ వంద టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చరిత్ర సృష్టించనున్నాడు. స్టోక్స్‌కు రాజ్‌కోట్ టెస్ట్ వందో టెస్టు మ్యాచ్ కానుంది. వైజాగ్ వేదికగా ఇటీవలే ముగిసిన రెండో టెస్టుతో స్టోక్స్ 99 టెస్టులు ఆడేశాడు. దశాబ్దకాలంగా ఇంగ్లండ్‌కు ఆడుతున్న స్టోక్స్ రాజ్‌కోట్ టెస్టును మధుర జ్ఞాపకంగా మలుచుకోవాలని భావిస్తున్నాడు. రాజ్‌కోట్ టెస్టుతో ఈ ఫార్మాట్‌లో 'సెంచరీ' కొట్టబోతున్న స్టోక్స్.. ఇంగ్లండ్ తరఫున 15వ క్రికెటర్‌గా నిలుస్తాడు.

**ఇంగ్లాండ్ తరపున 100 టెస్టులు ఆడిన ఆటగాళ్లు**

జేమ్స్ అండర్సన్ -184
స్టువర్ట్ బ్రాడ్ -167
అలెస్టర్ కుక్ -161
జో రూట్ -137
అలెక్ స్టీవార్ట్ -133
గ్రాహం గూచ్ -118
ఇయాన్ బెల్ -118
డేవిడ్ గోవర్ -117
మైఖేల్ అథర్టన్ -115
కొలిన్ కౌడ్రే -114
జెఫ్రీ బాయ్‌కట్ -108
కెవిన్ పీటర్సన్ -104
ఇయాన్ బోథమ్ -102
గ్రాహమ్ థోర్ప్ -100
ఆండ్రూ స్ట్రాస్ -100

ప్రస్తుతం ఇంగ్లండ్ టెస్టు జట్టులో అండర్సన్, రూట్ మాత్రమే ఉన్నారు. . స్టోక్స్ కూడా సెంచరీ క్లబ్ లో చేరుతుండటంతో ఈ టెస్టులో ఇంగ్లండ్ ఏకంగా ముగ్గురు శతాధిక టెస్టులు ఆడిన క్రికెటర్లతో ఆడే జట్టుతో నిలిచే అవకాశముంది. ఇప్పటివరకూ 99 టెస్టులు ఆడిన స్టోక్స్.. 6,251 పరుగులు చేశాడు. 36.34 సగటుతో 13 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు కూడా ఉన్నాయి. బౌలింగ్‌లో 197 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆరు వేల పరుగులు, 150కి పైగా వికెట్లు తీసిన ఆల్‌రౌండర్లలో జాక్వస్ కలిస్ (13,289 పరుగులు, 292 వికెట్లు), గ్యారీ సోబర్స్ (8,032 పరుగులు, 235 వికెట్లు) తర్వాత స్థానంలో స్టోక్స్ ఉన్నాడు.

# భారత్‌లోనే ఐపీఎల్ 2024 సీజన్..

## టోర్నమెంట్ విదేశాలకు వెళ్లదు..

### మేలో ఫైనల్ పోరు: ఛైర్మన్ అరుణ్ ధుమాల్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్‌ను భారత్‌లోనే నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఐపీఎల్ ఛైర్మన్ ధృవీకరించారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా ఐపీఎల్ 17వ సీజన్‌ను యూఏఈ లేదా దక్షిణాఫ్రికాకు మార్చనున్నట్లు గతంలో ఊహాగానాలు వచ్చాయి. అయితే, ఇప్పుడు ఈ ఊహాగానాలకు తెరపడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ ఫైనల్ మ్యాచ్ మే 26న జరగనుంది. అయితే, తుది తేదీని ఇంకా ఖరారు చేయలేదు. అయితే, టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు టీమిండియా ఆటగాళ్లకు బీసీసీఐ 8 నుంచి 10 రోజుల సమయం ఇవ్వాలని కోరుతోంది. ఛైర్మన్ అరుణ్ ధుమాల్ 17వ సీజన్‌ను భారతదేశంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ.. 'ఐపీఎల్ 17వ సీజన్ భారత్‌లో మాత్రమే ఆడనుంది. ఐపీఎల్ 17వ సీజన్ తేదీలను బీసీసీఐ త్వరలో ప్రకటించనుంది. లోక్‌సభ ఎన్నికల తేదీల కోసం ఎదురుచూస్తున్నాం. లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన వెంటనే ఐపీఎల్ 17వ సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేస్తాం.

ఐపీఎల్ 17వ సీజన్ ఫైనల్ మ్యాచ్ మే 26 వరకు ఆడవచ్చు. జూన్ 5 నుంచి టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానున్నందున, సన్నద్ధత కోసం ఆటగాళ్లకు బీసీసీఐ 8 నుంచి 10 రోజుల సమయం ఇవ్వవచ్చు. అయితే, దీనికి సంబంధించి ఇంకా అధికారిక ధృవీకరణ లేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ 17వ సీజన్‌ను భారత్‌లో కాకుండా విదేశాలకు తరలించే అవకాశం ఉందని గతంలో ఊహాగానాలు వచ్చాయి. ఐపీఎల్ రెండో సీజన్ 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. 2014లో కూడా లోక్‌సభ ఎన్నికల కారణంగా ఐపీఎల్ ప్రథమార్థం యూఏఈకి మారింది. అయితే, ఈసారి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీసీఐ ఐపిఎల్ 17వ సీజన్‌ను భారత్‌లో నిర్వహించనుంది.



## హనుమంతుడిగా

# స్టార్ హీరో యష్

హనుమాన్ క్రియేట్ చేసిన సెన్సేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంక్రాంతి కానుకగా విదులైన ఈ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ దాదాపు 300కోట్ల వరకు వసూల్ చేసి రికార్డ్ క్రియేట్ చేసింది. పాన్ ఇండియా మూవీగా రిలీజ్ అయిన ఈ విడుదలైన అన్ని భాషల్లో సూపర్ హిట్ గా నిలిచింది. ఇప్పటికీ హనుమాన్ కొన్ని థియేటర్స్ లో హౌస్ ఫుల్ గా రన్ అవుతుంది. అయితే ఇప్పుడు చాలా మంది ఇతిహాసాల ఆధారంగా లు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా కన్నడ స్టార్ హీరో యష్ హనుమంతుడి పాత్రలో నటిచనున్నాడని వినిపిస్తున్నాయి. హనుమంతుడిగా నటించేయడానికి యష్ రెడీ అవుతున్నాడని కన్నడ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. యష్ ప్రస్తుతం 'టాక్సిక్' తో బిజీగా ఉన్నాడు. దీంతో పాటు ఆయన తదుపరి లపై అనేక రూమర్లు పుట్టుకొచ్చాయి. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న బాలీవుడ్ మూవీ 'రామాయణం'లో రావణుడి పాత్రలో నటిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు లేటెస్ట్ న్యూస్ ఏంటంటే.. 'జై హనుమాన్' లో హనుమంతుడి పాత్రలో యష్ నటించనున్నాడట. ప్రశాంత్ వర్మ హనుమాన్ తర్వాత ఇప్పుడు జై హనుమాన్ అనే చేయడానికి రెడీ అవుతున్నాడు. ఈ లో హనుమంతుడిగా యష్ నటిస్తాడని అంటున్నారు. జై హనుమాన్ ను మరింత పెద్దదిగా తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు ప్రశాంత్ వర్మ. హనుమాన్ లో తేజ సజ్జ హనుమంతుడి భక్తుడిగా నటించాడు. సీక్వెల్‌లో కూడా అతని పాత్ర అదే విధంగా కొనసాగుతుంది. సీక్వెల్‌లో హనుమంతుడి పాత్ర కూడా కీలకంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ పాత్ర కోసం దర్శకుడు యష్‌ని అనుకుంటున్నారట. నితేష్ తివారీ 'రామాయణం'లో రావణుడి పాత్రలో నటించనున్నాడని వచ్చాయి. ఒక లో హనుమంతుడిగా మరో లో రావణుడి పాత్రలో నటిస్తే జనాలు ఎలా ఆదరిస్తారో చూడాలి. అసలు ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది చూడాలి.

# ఎకో ఫ్రెండ్లీ కాన్సెప్ట్‌తో రకుల్ ప్రీత్ సింగ్ పెళ్లి..

## నెటిజన్స్ ప్రశంసలు

సాధారణంగా స్టార్స్ పెళ్లి వేడుక అంటే ఏ రేంజ్ లో ఉంటుంది. డెస్టినేషన్ వెడ్డింగ్స్, కలర్ ఫుల్ డెకొరేషన్స్, స్టార్ సెలెబ్రెటీలు, డీజే మోతలు అబ్బో ఇలాంటివి చాలానే ఉంటాయి. అయితే హీరోయిన్ రకుల్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా తన పెళ్లి చేసుకోనుందట. ఇందుకోసం సరికొత్త కాన్సెప్ట్‌ను సెలెక్ట్ చేసుకున్నారట. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంతకీ అసలు విషయం ఏంటంటే.. హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీ కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే వీరి పెళ్ళి ఫిబ్రవరి 21న గోవా వేదికగా జరుగనుంది. అంగరంగ వైభవంగా జరుగనున్న ఈ పెళ్లి వేడుకలు ఫిబ్రవరి 19నుంచే మొదలుకానున్నాయి. అయితే.. రకుల్, జాకీ జంట తమ పెళ్లి కోసం ఎకో ఫ్రెండ్లీ విధానాన్ని అనుసరించనున్నారట. అంటే.. టపాసులు పేల్చడం, డీజే సౌండ్స్ సిస్టమ్స్ వంటివి ఉండవట. వాటి వలన పర్యావరణ జరుగుతుందని వాటిని అవాయిడ్ చేస్తున్నారట. అంతేకాదు పేపర్ కూడా వేస్ట్ అవకుండా వివాహ ఆహ్వానాన్ని డిజిటల్ రూపంలోనే చేయిస్తున్నారట. అయితే.. రకుల్, జాకీల ఎకో ఫ్రెండ్లీ విధానం గురించి తెలుసుకున్న నెటిజన్స్ ఈ జంట పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ జంటలాగే అందరు కూడా ఇలాంటి డెసిషన్ తీసుకుంటే బావుంటుందని కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం రకుల్, జాకీల పెళ్లి వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.





# హృతిక్ రోషన్ కాలికి గాయం

## వార్-2 సినిమా చిత్రీకరణ వాయిదా..?

ప్రముఖ బాలీవుడ్ కథా నాయకుడు హృతిక్ రోషన్ కాలికి గాయమైంది. ఈ సంగతి ఆయన తన సోషల్ మీడియా హ్యాండిల్‌పై పోస్ట్ చేశారు. ఈ మేరకు తన నడుముకు బెల్ట్ పెట్టుకున్ని క్రచెస్ మద్దతుతో నిలుచున్న ఫోటోను షేర్ చేశారు. -మీలో ఎంత మందికి క్రచెస్, వీల్ ఛైర్ అవసరమొచ్చింది. అప్పుడు మీ ఫీలింగ్ ఏమిటి?-అని పోస్ట్ చేశారు. తనను తాను మోటివేట్ చేసుకుంటున్నానని, ఆ బాధ నుంచి కోలుకుంటున్నానని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సినీ ప్రముఖులు టైగర్ షరాఫ్, వరుణ్ ధావన్, వాణీ కపూర్ తదితులు, ఫ్యాన్స్. నెటిజన్లు ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కాలికి గాయం కావడంతో ఆయన రెస్ట్ తీసుకుంటారని, తత్ఫలితంగా వార్-2 సినిమా చిత్రీకరణ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ మీడియా తెలిపింది. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో చిత్రీకరిస్తున్న ఈ సినిమాలో టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ కూడా నటిస్తారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా ప్రకటన వెలువడగానే అభిమానుల్లో భారీ అంచనాలు మొదలయ్యాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్ క్యారక్టర్‌లో నటిస్తారని తెలుస్తున్నది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల చేయడానికి చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# గ్రామీణ ప్రేమకథ 'శశివదనే'



రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి నిర్మించారు. ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అంటూ పోస్టర్ మీద వేసిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. 'గ్రామీణ నేపథ్యంలో నడిచే హృద్యమైన ప్రేమకథా చిత్రమిది. పోస్టర్ మీద వేసిన డైలాగ్ సినిమా సారాంశాన్ని మొత్తం తెలియజేస్తుంది. మెలోడీ ప్రధానమైన పాటలతో ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. శ్రీమన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ, మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణ వాసుదేవన్, రచన-దర్శకత్వం: ఎమోహన్ ఉబ్బన.

# నిర్మాత బండ్ల గణేష్‌కు ఏడాది జైలు శిక్ష



టాలీవుడ్ సినిమా పరిశ్రమలో నిర్మాతగా నటుడిగా మంచి అందుకున్న బండ్ల గణేష్ ఇటీవల సినిమాలు తగ్గించారు. విషయం ఏమిటంటే, తాజాగా ఆయనకి జైలు శిక్ష విధించింది ఒంగోలు కోర్టు. అసలు సంగతిలోకి వెళితే, ఇటీవల జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేష్ తన పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్స్ తరపున ఇచ్చిన చెక్ బౌన్స్ అవడంతో అతడు కోర్టుకి వెళ్లడం జరిగింది. కాగా కొన్నాళ్లగా కోర్టులో కొనసాగుతున్న ఆ కేసులో తాజాగా ఒంగోలు సెకండ్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చింది. బండ్ల గణేష్ కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.95 లక్షల జరిమానాను కూడా విధించింది కోర్టు. అలానే ఈ తీర్పును బండ్ల గణేష్ ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునేందుకు నెల రోజుల గడువు కూడా ఇచ్చింది. మరి దీని పై బండ్ల ఎలా ముందుకు సాగుతారో చూడాలి.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.